# 33 వ అధ్యాయము

# సువార్తీకరణకు పనికివచ్చు కొన్ని రహస్యములు

తాను ప్రేమించు ఏకైక కుమారుడు ఇస్సాకును అబ్రాహాము దేవునికి బలి అర్పణలో అర్పించు సమయంలో దేవుడు అబ్రాహామునకు ఈ వాగ్దానము చేసెను:

మరియు నీవు నా మాట వినినందున భూలోకములోని జనములన్నియు నీ సంతానము వలన ఆశీర్వదించబడును (ఆది 22:18).

అబ్రాహామునకును అతని సంతానమునకును ఏక వచనము అంతేకాని **విత్తనములు** అను బహువచనము కాదు అని అపొ. పౌలు అబ్రహామునకు దేవుడిచ్చిన వాగ్దానమును గూర్చి ఆ ఒకే **విత్తనము** క్రీస్తు అని వ్రాసెను (గలతీ 3:16). క్రీస్తు నందు సర్వజనాంగములు మరింత స్పష్టముగా భూమిలోని సకల వంశములు ఆశీర్వదించబడును. భూమండలముపై ఉన్న అన్యజాతి వంశములన్నియు క్రీస్తునందు ఆశీర్వదించబడుననియు ముందుగానే ప్రవచించబడి ఈ జనాంగములన్నిటిని ఆ ఆశీర్వాదములో ఇమిడ్చెను. ఈ సకల జాతి గుంపుల వారు ఒకరి నుండి మరియొకరు వారి వేషభాషలలోను జీవన పరిస్థితులలోను భౌగోళికంగా నివసించు ప్రదేశములలోను ఎన్నో వ్యత్యాసములు తేడాలు కలిగి ఉన్నను వివిధ జాతుల వారు వివిధ సంస్కృతి సాంప్రదాయపు అలవాట్లు గలవారు వివిధ రకమైన భాషలు మాట్లాడువారు క్రీస్తునందు వారందరు, దీవింపవలెనని దేవుడు కోరుచున్నాడు. సర్వలోకములోని మానవాళి కొరకు క్రీస్తు వారి పాపముల నిమిత్తమై చనిపోయెను (1 యోహాను 2:2).

“యేసు ఈలాగు చెప్పెను, జీవమునకు పోవు మార్గము ఇరుకు అయినది దాని కనుగొను వారు కొద్దిమంది” (మత్తయి 7:14). అపొ. యోహాను ప్రపంచంలోని సకల జాతి ప్రజలు ఆయా దేశముల వారు, ఆయా భాషలు మాట్లాడు వారు తమ తమ జాతులకు, దేశములకు, భాషలకు వంశముల ప్రతి నిధులుగా రాబోవు దేవుని రాజ్యములో ఏకముగా కూడియుందురని అపొ. యోహాను మనమందరము నమ్ముటకు ఒక మంచి కారణము చూపించెను:

> అటు తరువాత నేను చూడగా, ***యిదిగో ప్రతి జనములో నుండియు, ప్రతి వంశములో నుండియు, ప్రజలలో నుండియు, ఆయా భాషలు మాట్లాడు వారిలో నుండియు*** వచ్చి, ఎవడు లెక్కింప జాలని ఒక గొప్ప సమూహము కనబడెను. వారు తెల్లని వస్త్రములు ధరించుకొన్న వారు. ఖర్జూరపు మట్టలు చేత పట్టుకొని సింహాసనము ఎదుటను, గొఱ్ఱెపిల్ల యెదుటను నిలువబడి సింహాసనాసీనుడైన మా దేవునికిని, గొఱ్ఱె పిల్లకును మా రక్షణకై స్తోత్రమని మహా శబ్దముతో ఎలుగెత్తి చెప్పిరి (ప్రకటన 7:9-10).

గొప్ప ప్రత్యక్షతతో దేవుని పిల్లలు ఒక మహా గొప్ప సమూహముగా వివిధములైన జాతుల ప్రజలు దేవుని సింహాసనము ఎదుట ఒకానొక దినమందు ఐక్యముగా కలిసి నిలిచియుండు ఆ దినము కొరకు ఎదురు చూచుచుందురు.

అనేక మంది మిషనరీలు వివిధమైన సొర్తిక ప్రణాళికలతో ప్రపంచమందు ఇంకా అనేక మారు మూలలలో "మరుగుగా" నివసించుచున్న ఆయా జాతుల ప్రజలకు సువార్త ప్రకటించి వారి కొరకు క్రైస్తవ సంఘములను స్థాపించుట కొరకు పథకములు స్థిరము చేయుచున్నారు. ఇది ఎంతయో మెచ్చుకొనదగిన విషయము. మీరు సర్వలోకముకు వెళ్ళి సమస్త మనుష్యులను (సకల జాతులను) శిష్యులనుగా చేయుడి అను యేసు ఆజ్ఞలను ఆచరణలో చూపుటకు మానవులు ఎన్నో ప్రణాళికలు ఎంతో గొప్ప ఆశక్తితో, ఉద్దేశ్యముతో చేయుచున్నారు. పరిశుద్ధాత్మ సహాయము, నడిపింపు లేని యెడల వృథా ప్రయాసమగును. మేలు కన్నా కీడే ఎక్కువ జరుగును. దేవుని రాజ్యమును అట్టి ప్రదేశములలో నిర్మించుటకు దేవుని జ్ఞానమును కలిగి దేవుని చిత్తమును వెంబడించుట చాలా ప్రాముఖ్యము. మత్తయి 28:19లో మనము చదువు దానికంటే ఇంకా ఎక్కువైన వివరములు మరియు సమాచారము ప్రపంచ వ్యాప్తముగా మనము శిష్యులను సిద్ధము చేయుటకు ఆయన అనుగ్రహించియున్నాడు.

దేవుడిచ్చిన ఈ గొప్ప ఆదేశము అనుసరించి పనిచేయువారందరు ఒక ముఖ్యమైన సంగతిని విస్మరించుచున్నారు. అదేమనగా సొవార్తీకరణలో అందరికంటే ప్రప్రథమ సువార్తీకుడు దేవుడే. మనమందరము ***ఆయనతో*** కలసి పాలిభాగస్థులముగా పనిచేయుచున్నామే గాని అయన ***కొరకు*** మాత్రమే పనిచేయుట లేదు. ఏవ్యక్తి కంటేను అత్యంత ప్రాముఖ్యముగా సువార్తను ప్రపంచములోని వారందరికి అందించుటకై అందరికంటే ఎక్కువగా దేవుడే పనిచేయుచున్నాడు. దేనికొరకైతే యేసు సిలువలో చనిపోయెనో ఆ కార్యక్రమమును అత్యంత శ్రద్ధతో ఎక్కువ సమర్పణతో ఆయన పనిచేయుచు ఆ పనియందు నిమగ్నమైన వారి యెడల ఆయన ఎంతో శ్రద్ధాసక్తులతో వారిని సంరక్షించుచున్నాడు. ఎవనినైనను సృజించక మునుపే ఈ రాజ్య సువార్త పని జరిగించుటను గూర్చి ఆలోచించుచు ఆ వ్యక్తి రక్షణ నొందవలెనని కోరుచు నిబద్ధతతో అతనికి సువార్తను అందించుటకు దేవుడే ప్రయాసపడుచూ ఉన్నాడు.

## క్రీస్తు కొరకు ఈ లోకమును సంపాదించుట

నూతన నిబంధన పత్రికలను మనము ఆసక్తితో చదువుచున్నప్పుడు అందు విశ్వాసులు త్వరపడి "లోకములోనికి వెళ్ళి క్రీస్తు కొరకు జనులను సంపాదించవలెనని" అభిప్రాయము కనుబర్చు వారే గాని ఏ మాత్రము ఆసక్తి లేని వారి వలె (నేడు మనం ఆనాసక్తిని చూపిస్తున్నట్లుగా) ఆనాటి విశ్వాసులు లేరు. ఆది క్రైస్తవులు మరియు క్రైస్తవ నాయకులు లోకమును విమోచించు గొప్ప కార్యములో దేవుడు ఎంతో శ్రద్ధతో ఆసక్తితో పనిచేయుచున్నాడని గ్రహించి, సువార్త పరిచర్యలో ఆయనతో జతపనివారిగా ఉండి, ఆయన నడిపించు చోట్లనెల్ల దేవునితో సహకరించుచు పనిచేయుచుండిరి. ఈ విషయము చక్కగా గ్రహించిన వాడు అపొ. పౌలు. పౌలును ఎవరును "ప్రభువునొద్దకు నడిపించలేదు" గాని, దేవుడే స్వయముగా పౌలుకు

కనబడి దమస్కు మార్గమందు ప్రత్యక్షుడై అతనిని దేవుని రాజ్యపు పనికొరకు ఏ ఉద్దేశ్యముతో ఏర్పరచుకొని యున్నాడో దానిని సవిరముగా తెలియజేసెను. అపొస్తలుల కార్యములు గ్రంథమందంతటను సంఘము అత్యంత వేగముగా విస్తరించుటకు మూలకారణము పరిశుద్ధాత్మచేత నిండిన వారై ఆత్మచేత అభిషేకించబడి, ఆత్మచేత నడిపించబడిన వారు ఆత్మాశక్తితో పనిచేయుట వలన సంఘము వేగముగా విస్తరించుట జరిగెను. "అపొ. కార్యముల గ్రంథమును" పేరుకు అలాగు పిలువబడినను వాస్తవముగా అది "దేవుని కార్యముల గ్రంథమని" పేర్కొనబడవలెను. అపొ. కార్యముల యొక్క ఉపోద్ఘాతములో లూకా తన మొదటి పుస్తకము అనగా తన పేరున వ్రాయబడిన లూకా సువార్త "యేసు చేయుటకును బోధించుటకును **మొదలు** పెట్టిన వన్నిటి గూర్చి రచించితిని అని వ్రాయుచున్నాడు" (అపొ. కా. 1:1). అపొ. కా. గ్రంథము యేసు ఏమి బోధించెనో ఆయన దాని చేయుట ***కొనసాగించి*** యున్నాడని లూకా పరిపూర్ణముగా విశ్వసించి అపొ. కా. గ్రంథములో దానిని వ్రాయుచున్నాడు. యేసు ఆత్మచేత అభిషేకించబడి, ఆత్మ చేత నడిపించబడు సేవకుల యొక్క సహాయసహకారముతో పనిచేయగలుగుచున్నాడు.

ఆది సంఘ క్రైస్తవులు అక్కడ నుండి త్వరగా వెళ్ళి "తమ ఇరుగు పొరుగు వారికి క్రీస్తును గూర్చి ప్రకటించి ప్రపంచమును క్రీస్తు కొరకు సంపాదించుటకు" బహుగా ప్రోత్సాహపర్చబడియున్నారు. అది దేవుని రాజ్యము కట్టుటలో వారి బాధ్యతయై యున్నది. అపొస్తులులు, సువార్తికులు కొన్ని ప్రత్యేకమైన ఆత్మవరములతో సువార్తను బహిరంగముగా ప్రకటించుటకు దేవునికి విధేయత కలిగి, పరిశుద్ధత కలిగిన జీవితములతో ఎల్లప్పుడును సువార్త పక్షముగా ఎదురాడి దూషించు వారితోను తమ్ము ప్రశ్నించు వారితోను, సమాధానకరమైన ప్రత్యుత్తరములు ఇచ్చుచు తమ్మును భద్ర పరచుకొనుచుండిరి.  ఉదా: పేతురు ఈలాగు వ్రాసియున్నాడు,

మీరు ఒకవేళ నీతి నిమిత్తము శ్రమపడినను మీరు ధన్యులే. వారి బెదరింపులకు భయపడకుడి, కలవరపడకుడి; నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారై మీలో ఉన్న నిరీక్షణ గూర్చి మిమ్మును హేతువడుగు ప్రతివానికిని సాత్వికముతోను, భయముతోను సమాధానము చెప్పుటకును ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి మీ హృదయముల యందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్టించుడి. అప్పుడు మీరు దేని విషయమై దుర్మార్గులమని దూషింపబడుదురో దాని విషయమై క్రీస్తునందున్న మీ సత్ప్రవర్తన మీద అపనింద వేయు వారు సిగ్గుపడుదురు (1 పేతురు 3:14-16).

ఏ క్రైస్తవులకు పేతురు ఈ పత్రిక వ్రాయుచున్నాడో వారు శ్రమలను హింసలను సహింపవలెనని వ్రాయుచున్నాడని మనము గమనించవలెను. క్రైస్తవులు ప్రపంచములోని మిగతా వారి కంటే ప్రత్యేకమైన వారుగా ఉండని యెడల లోకములోని వారు వారిని ఏ మాత్రము హింసించి ఉండరు. ఈ కారణముచేతనే అనేక ప్రదేశములలో నేడు క్రైస్తవులకు అంత ఎక్కువగా హింసలు కలుగుట లేదు. ఎందుకనగా నేటి క్రైస్తవులు అన్యజనులకంటే ఏ మాత్రము భిన్నముగా

జీవించుట లేదు. క్రైస్తవత్వమే వారిలో లేనట్లుగా జీవించుచున్నారు. అందుచేత వారిని ఏ మాత్రము హింసించుటలేదు. అందుచేతనే క్రైస్తవులు సంఘములో ప్రతి ఆదివారము "నీ పొరుగువారితో సువార్తను పంచుకొనుడి" అని పదే పదే హెచ్చరించబడుచున్నారు. వారి పొరుగువారితో తమ క్రైస్తవ సాక్ష్యమును వారు పంచుకొనిన యెడల వారు నిజముగా తిరిగి జన్మించిన క్రైస్తవులని వారిని అతి ఆశ్చర్యముతో గమనించుచుందురు. కేవలము సత్‌క్రియలను గూర్చి దేవుని యందు భయభక్తులను గూర్చి తమ పొరుగు వారితో చెప్పిన యెడల వారు తప్పు అభిప్రాయమును కలిగియుండుటకు ఆస్కారము కలదు. సువార్తను ప్రకటించుట వలన తమ పొరుగువారికి ఒక సంతోషకరమైన శుభసమాచారమును తెలుపుచున్నారు. అది వారికి రక్షణ కరముగా పరిణమించును. ఇందు అత్యంత కీలకమైనది ఏమనగా "యేసు క్రీస్తునను వారి వ్యక్తిగతమైన రక్షకుడుగా అంగీకరించుట" అనునది.

అంధకారమందు దివ్య జ్యోతులవలె ప్రకాశమానమైన వెలుగు ఆది సంఘ క్రైస్తవులు ప్రభువు కొరకు స్థిరముగా నిలువబడి ఉండిరి. అందుచేత తమ ఇరుగు పొరుగు వారికి తాము క్రీస్తును వెంబడించువారని ప్రత్యేకముగా చెప్పుటకు వారు ఏమి ఎట్లు సాక్ష్యమివ్వవలెను అను దానిని నేర్చుకొను తరగతులకు వారు వెళ్ళవలసిన ఆవశ్యకత లేదు. నీతిని గూర్చి వారు ప్రశ్నించబడునప్పుడు వారికి ఎన్నో అవకాశములు కలిగియుండిరి. పేతురు సెలవిచ్చునట్లు వారు యేసును తమ హృదయములో ప్రభువుగా ప్రతిష్టించుకొని సువార్త పక్షముగా ఏ విధమైన ప్రత్యుత్తరమైన చెప్పుటకు సంసిద్ధముగా ఉండిరి.

నేటి ఆధునిక క్రైస్తవులకును మొదటి క్రైస్తవ సంఘస్థులకును ఉన్న ప్రాముఖ్యమైన వ్యత్యాసమేదనగా: నేటి ఆధునిక క్రైస్తవులు తాను సిద్ధాంతపరముగా ఏమి నేర్చుకొని, తెలుసుకొని నమ్మి యున్నాడో దానిని దాని వ్యక్తిత్వములో సిద్ధపాటు పొందియున్నాడు. అనగా సిద్ధాంత పరమైన అంశములను అతను నేర్చుకొనియున్నాడు. దానికి భిన్నముగా ఆది సంఘ క్రైస్తవులు క్రీస్తు ఆజ్ఞలకు విధేయులై వారు సాక్ష్యజీవితములో ఎట్లు ఆచరణాత్మకముగా క్రైస్తవ జీవితమును జీవించిరో దానిని బట్టి వారి క్రైస్తవ జీవితము ప్రాముఖ్యత కలిగినది. మనము గమనించవలసిన ఆశ్చర్యకరమైన విషయమేదనగా మొదటి 14 శతాబ్ధముల వరకును క్రైస్తవులు వారి సొంత చేతులలో బైబిలు గ్రంథము వ్యక్తిగతముగా ఎవరి యొద్దను లేదు. అందుచేత "ప్రతి దినము తన బైబిలు తాను చదువుకొను అవకాశము వారికి అసాధ్యమాయెను." వారి సమకాలీన పరిస్థితులలో అపొస్తలుల బోధయే వారికి అత్యంత ప్రధానమైన జీవిత నియమావళిగా ఆది క్రైస్తవులకు ఉండెను. చాలామంది నేటి ఆధునిక క్రైస్తవులు బైబిలు గ్రంథము అనుదినము చదువుచుండవచ్చును గాని, వాక్యమునకు విధేయులై జీవించుట అంత ఎక్కువగా కనబడుట లేదు. నేడు ప్రపంచములో 29, 999 క్రైస్తవ మత శాఖలున్నవి. అందులో ఎవరికి వారే తమ మత శాఖ యొక్క సిద్ధాంతము చాలా ప్రాముఖ్యమని ఎంచుచు ఆ సిద్ధాంతపరముగా గర్వాతిశయము కలిగి ఉందురు. అయినప్పటికిని వారు అనవసరమైన వ్యర్థసంభాషణలు, అబద్ధములు మోసములు చేయుచు మరియు భూ సంబంధమైన సిరిసంపదలను

సమకూర్చుకొనుటయందు అత్యాశక్తిని కనబర్చుచుందురు.

మనుష్యుల హృదయములు సువార్త ప్రబోధము వలన మెత్తన చేయబడి సువార్త సత్యమును వారు ఆసక్తితో అంగీకరించి కేవలము సిద్ధాంతములు గైకొనుట కాక వారి క్రియాచరణములో సువార్త సత్యమును వారు ఆచరించి చూపవలెను.

## దేవుడు, అత్యంత శ్రేష్టమైన గొప్ప సువార్తికుడు

దేవుడు ఆయన రాజ్యమును నిర్మించు విషయమును గూర్చి మరింత వివరముగా ఆలోచింతుము. ఆయన పనిచేయు తీరును మనము యుక్తముగా గ్రహించిన యెడల ఆయనకు తగినట్లుగా మనమాయన పనిలో ఆయనతో కూడా సహకరించగలము.

ఒకరు యేసు క్రీస్తును నమ్మినప్పుడు అది వారి హృదయమునకు సంబంధించిన విషయము (రోమా 10:9-10). వారు ప్రభువైన యేసు క్రీస్తు నందు విశ్వాసముంచి పశ్చాత్తాపపడి వారి హృదయ సింహాసనము మీద నుండి తమ సొంత ఇష్టము లేక చిత్తము అనుదానిని క్రిందకు దింపివేసి ప్రభువైన యేసును వారి హృదయ సింహాసనము మీద ఆసీనుడుగా చేసి దేవుని చిత్తమునకు లోబడుటకు నిశ్చయించుకొందురు. ***దేవునిని నమ్మట అనునది మార్పు పొందిన హృదయమును స్పష్టము చేయును.***

ఆలాగుననే ఎవరు యేసునందు ***విశ్వాసముంచరో*** అది వారి హృదయమునకు సంబంధించిన విషయము గనుక వారు దేవునిని ***ప్రక్కకు నెట్టివేసి*** ఏ మాత్రము పశ్చాత్తాప పడక వారి మనస్సాక్షితో ఒక తీర్మానము చేసుకొని యేసును వారి హృదయ సింహాసనము మీద నుండి తొలగించి తమ సొంత ఇష్టము లేక చిత్తమును వారి జీవితమును ఏలుబడి చేయుటకు హృదయ పీఠము మీద "నేను" అను స్వార్థమును కూర్చుండబెట్టుదురు. ***అవిశ్వాసము అనునది హృదయము ఏ మాత్రము మార్పు చెందకుండా ఒక కఠినమైన తీర్మానమును ఎల్లప్పుడు తీసుకొనుచు నుండును.***

తండ్రి ఒకరిని తన యొద్దకు ఆకర్షించితినే గాని తన యొద్దకు జనులు ఏ మాత్రము రాకుండుటకు కారణము వారి హృదయములు బహుగా కఠినపర్చబడినవి అని యేసు సూచించెను (యోహాను 6:44). అనేక విధముల ద్వారా దేవుడు దయగలిగిన వారై యేసు నొద్దకు అనేకులు వచ్చునట్లు వారిని ఆకర్షించుచున్నారు. అందుచేత వారి హృదయములను మెత్తనివిగా చేసుకొనుట గాని, లేక కఠినపరచుకొనుట గాని జనులు ఎల్లప్పుడు తీర్మానము చేసుకొనుచు ఉండవలెను.

యేసు నొద్దకు జనులు వచ్చునట్లు ఆకర్షించుటకు వారి హృదయములను ఏ విధానముల ద్వారా దేవుడు తాకి వారి హృదయములో నిరీక్షణ కలుగజేయును?

మొట్టమొదటిదిగా పౌలు వ్రాసినట్లు తన సృష్టి అంతటిని ప్రజలు గమనించుట ద్వారా దేవుడు జనులను యేసు నొద్దకు ఆకర్షించుచున్నాడు,

> దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త
> భక్తిహీనత మీదనుు, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకము

నుండి బయలు పరచబడుచున్నది. ఎందుకనగా దేవుని గూర్చి తెలియ శక్యమైనదేదో అది వారి మధ్య విశదమై యున్నది; దేవుడు అది వారికి విశదపరెచెను. ***ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్య శక్తియు, దేవత్వమును జగదుత్పత్తి మొ॥ సృష్టించబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటబడుచున్నవి. గనుక వారు నిరుత్తరులైయున్నారు*** (రోమా 1:18-20).

సత్యమును అణచి వేయుట అనునది స్పష్టముగా ప్రజలలో కనిపించునట్లు పౌలు వ్రాసినది మనము గమనించవలెను. అనగా వారి అంతరంగములలో సత్యము పైకి లేచి నిలువబడుచున్నను వారిని దినదినము వారి యెదుట నిలుచుచున్నను వారి దానిని వెనుకకు నెట్టివేసి వారి అంతరంగములో ఉన్న సత్య సాక్ష్యమును అణచివేయుదురు.

ప్రతి వ్యక్తిలో అంతరంగములో స్పష్టముగా కనిపించు సత్యము ఏమైయున్నది? పౌలు ఆ సత్యమును గూర్చి వివరించుచు అవి దేవుని యొక్క అదృశ్య లక్షణములు, ఆయన నిత్యశక్తి ఆయన దైవత్వపు స్వభావము "సృజించబడిన వస్తువులన్నిటిలో" అది బయలు పరచబడుచున్నది. దేవుడున్నాడను సత్యమును ఆయన సృష్టిని పరిశీలించి తెలుసుకొనుట వలన మనుష్యులు లోలోపల గ్రహించగలుగు చున్నారు.[101] ఆయన అనంతమైన శక్తి సంపన్నుడని సృష్టి నిర్మాణములో అత్యద్భుతమైన జ్ఞానమును ప్రశ్నించిన శక్యము గాని వివేకమును ఆయనకు కనబరిచియున్నాడని సృష్టిని పరీక్షించిన ప్రతి వ్యక్తి దేవుడు ఉన్నాడని గ్రహింపగలడు.

పౌలు ముగింపు మాటలలో చెప్పునది ఏమనగా అట్టి ప్రజలు, "నిరుత్తరులై" యున్నారని చెప్పుచున్నాడు. గనుక ఆయన చెప్పినది వాస్తవమే. ప్రతి నిత్యము దేవుడు ప్రతి ఒక్కరికి చాలా గొప్ప శబ్దముతో అరచి చెప్పుచున్నట్లు మాట్లాడుచు తనను తాను ప్రత్యక్షపరచుకొనుచు వారి హృదయములను మెత్తన చేయుటకు ప్రయత్నించుచునే ఉన్నాను. మనుష్యులు తమ చెవులను మూసివేసుకొనుచునే ఉండిరి. అయితే మనుష్యుల జీవితములలో వారు వారికి వినబడునట్లుగా దేవుడు పెద్ద శబ్దముతో అరచుచునే ఉన్నాడు. ఆయన ప్రతి నిత్యము జరిగించు అద్భుత క్రియల ద్వారాను పుష్పముల సౌందర్యములో, సుగంధములో పక్షుల కిల కిల రావములో వాటి అందచందములలో పసిబిడ్డల నిర్దోషమైన అమాయకమైన చిరునవ్వులతో స్వచ్ఛమైన తెల్లటి మంచు గుణములలో వివిధ రకములైన ఫలములు ప్రకృతి రమణీయమైన కొండలు, గుట్టలు, జలపాతములు, సెలయేళ్ళు మున్నగు వాటిలో దేవుని యొక్క స్వరము వినిపించుచునే యుండును. మనకు కనబడు సృష్టి అంతటి కంటే దేవుడు అత్యున్నతుడును మహాగొప్పవాడునై యున్నాడు. అందును బట్టి సృష్టిలో ప్రతి ప్రాణియు, ప్రతిదియు ఆయనకు లోబడవలసినదే. అందుచేత ఈ ఆంతర్య దర్శనమందు దేవుని స్వరము

[101] అందుచేతనే దేవుని లేఖనములు ఈ విధముగా ప్రకటించుచున్నవి. దేవుడు లేడని బుద్ధిహీనుడు తమ హృదయములో అనుకొనును (కీర్తన 14:1). బుద్ధి లేని వారు మాత్రమే దేవుని గూర్చిన సత్యమును అణచి వేయుటకు ప్రయత్నింతురు.

బహు స్పష్టముగా గట్టి స్వరముతో, ప్రకటించునది ఏమనగా పశ్చాత్తాపపడుము. అందుచేతనే పౌలు మనుష్యులందరు దేవుని స్వరము వినుచూనే ఉన్నారు గనుక పశ్చాత్తాపపడుడని ప్రకటించుచున్నాడు.

> అయినను నేను చెప్పునది ఏమనగా, వారు వినలేదా? విన్నారు కదా? వారి స్వరము భూలోక మందంతటికిని వారి మాటలు భూదిగంతముల వరకును బయలు వెళ్ళెను (రోమా 10:18).

> 19వ సంకీర్తనలో నుండి పౌలు వాస్తవముగా ఉదహరించుచున్నాడు, ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధచేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాషలేదు మాటలు లేవు. వాటి స్వరము వినబడదు. వాటి కొలనూలు భూమియందంతట వ్యాపించియున్నది. ***లోకదిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలువెళ్ళుచున్నవి. వాటిలో ఆయన సూర్యునికి గుడారము వేసెను*** (కీర్తనలు 19:1-4).

దేవుడు ప్రతి ఒక్కరితో మాట్లాడుచున్నాడని ఈ వాక్య భాగము మనకు తెలియజేయుచున్నది. రాత్రి పగలు మరియు తన సృష్టి అంతటి ద్వారా దేవుడు మాట్లాడుచునే ఉన్నాడు. సృష్టి ద్వారా దేవుడు వినిపించు ఈ సందేశమునకు ప్రజలు సరిగా ప్రతిస్పందించని యెడల వారు ఆయన ఎదుట సాగిలపడి గొప్ప శబ్దముతో, "మహా గొప్ప సృష్టికర్తవైన దేవా, నీవు నన్ను సృజించితివి అందుచేత నేను నీకు వినయముగా లోబడుచున్నాను!"

## దేవుడు మనతో మాట్లాడు మరొక విధానము

దేవుని ప్రత్యక్షత వెలుపట కనబడు సృష్టిలోని మానవుని ఆంతర్యములోనే కాకుండా మానవుని హృదయాంతరంగపు లోతులలో మరియొక సాధనము ద్వారా దేవుడు తన దర్శనమును అనుగ్రహించుచున్నాడు. సృష్టిలో వెలుపట కనబడు అనేక అద్భుతముల ద్వారా కాకుండా ఈ అంతరంగిక ప్రత్యక్షత మానవుని హృదయాంతరంగము లోపట ఉండు అతని మనస్సాక్షియే. ఆ మనస్సాక్షి యొక్క స్వరము ఎల్లప్పుడును దేవుని స్వచ్ఛమైన చట్టమును ధర్మవిధిని ఎల్లప్పుడు బయలు పరచుచునే ఉండును. పౌలు ఈలాగు వ్రాయుచున్నాడు,

> ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మ శాస్త్ర సంబంధమైన క్రియలను చేసినయెడల వారు ధర్మశాస్త్రము లేని వారైనను తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టి వారి మనస్సాక్షి కూడా సాక్ష్యమిచ్చుచుండగను వారి తలంపులు ఒకదాని మీద ఒకటి తప్పు మోపుచు లేదా తప్పులేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్రానుసారము తమ హృదయముల యందు వ్రాయబడినట్టు చూపుచున్నారు. దేవుడు నా సువార్త ప్రకారము యేసు క్రీస్తు ద్వారా

మనుష్యుల రహస్యములను విమర్శించు దినమందు ఈలాగు జరుగును (రోమా 2:14-16).

ఈలాగున సరియైనది ఏదో, తప్పు ఎదో ప్రతి ఒక్కరు తెలుసుకొనుచున్నారు. అనగా మరియొక విధముగా చెప్పినయెడల దేవునిని ఏవి సంతోషపెట్టునో, ఏవి సంతోషపెట్టవో ప్రతి ఒక్కరును ఎరుగుదురు. దేవునిని సంతోష పెట్టని క్రియలు వారు ఏమి చేసిరో వాటన్నిటి విషయమై తీర్పు దినమందు ప్రతి మనుష్యుడును తన తరుపున తానే బాధ్యతతో జవాబు చెప్పుకొనవలెను. మనుష్యులు వయసులో పెద్ద వారగుచున్న కొలది వారు చేసిన పాపములు, తప్పిదములు విషయమై వారు తమ్మును తాము సమర్థించుకొనుచు మనస్సాక్షి యొక్క స్వరమును వారు అణచి వేయుచూనే ఉందురు. తమ లోపట మనస్సాక్షి యందున్న ధర్మశాస్త్రము ద్వారా దేవుడు మానక వారితో మాట్లాడుచూనే ఉండును.

## దేవుడు మనుష్యులతో మాట్లాడు మూడవ విధానము

మహాగొప్ప సువార్తికుడైన దేవుడు ప్రతి ఒక్కరిని మారుమనస్సుకు నడిపించుటకు ఇంత క్రితము చెప్పిన విధానముల ద్వారానే కాక ఇంకను వేరు విధానముల ద్వారా కూడా మాట్లాడుచున్నాడు. పౌలు మాటలను మరియొక సారి గమనించుదము,

దుర్నీతి చేత సత్యమును అడ్డగించు ***మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకము నుండి బయలు పరచబడుచున్నది*** (రోమా 1:18)

పౌలు మాటలను గమనించిన యెడల దేవుని కోపము ఏదో ఒక దినమున ***బయలుపరచబడునది*** కాక అది ఇప్పుడే బయలుపరచబడుచున్నదని తెలియజేయుచున్నాడు. మానవ సమాజము మధ్య నేడు జరుగుచున్న అనేక భయంకరమైన ప్రకృతి వైపరిత్యములు విశాదకరమైన దుర్ఘటనలు, బహు విచారకరమైన వినాశనములు ఉపద్రవములు, ప్లేగులు, అంటురోగములు మానవ జాతిని ఎంతో దు:ఖములో ముంచి వేయు సంఘటనలు దేవుని కోపము యొక్క సూచనలని గ్రహింపవచ్చును. దేవుడు సర్వశక్తిమంతుడని ఆయన ఏదైనా చేయగలడని దేనినైనా ఆయన నిలుపుదల చేయగలడని గ్రహించుకొని ఆయనను మరచిపోయి, ఆయనను విసర్జించు వారు ఈలాంటి భయోత్పాతములు ఘోర సంఘటనలు జరుగునప్పుడు, అట్టివి ఆయన ఉగ్రతను బయలుపర చునవి అని గ్రహించగలము. విజ్ఞత లేని వేదాంతులు బుద్ధిహీనమైన తత్వ శాస్త్రజ్ఞులు వాటిని చూడలేరు. అంతట దేవుని ఉగ్రతను చూపు కార్యములలో కూడా దేవుని దయ, ఆయన ప్రేమ బయలు పరచబడును. ఈ లోకమునందు సంభవించు దేవుని ఉగ్రతకు చిహ్నములైన ఉపద్రవములు తెలియజేయునది ఏమనగా దేవుడు ప్రేమపూర్వకముగానే రాబోవు నిత్య నాశనము గూర్చి ఆయన హెచ్చరించుచు మారుమనస్సు పొందక ఉండువారు దేవుని నిత్య ఉగ్రత నిత్య మరణము యొక్క దండన అనుభవించుదురని తెలియజేయుచున్నాడు. ఈ లోక సంబంధమైన దుర్ఘటనలు భయోత్పాతములు అను విధానముల ద్వారా ప్రజలు మారుమనస్సు పొంది పశ్చాత్తాప పడవలసిన అవసరత గ్రహించునట్లు ప్రజల

యొక్క దృష్టిని తనవైపునకు మరల్చుకొను చున్నాడు.

## దేవుడు తన జనులతో మాట్లాడు నాల్గవ విధానము

సృష్టి అంతటి ద్వారా దేవుడు ప్రజల దృష్టి అంతటను తన వైపుకు మరల్చుకొనుట ద్వారానే కాకుండా మనస్సాక్షి ద్వారాను మరియు అనేక ఉపద్రవముల ద్వారా మాత్రమే కాక, సువార్త ప్రకటన ద్వారా కూడా మనుష్యుల దృష్టి తనవైపుకు త్రిప్పుకొనుచున్నాడు. దేవుని సేవకులు, దేవుని ఆజ్ఞకు లోబడి సువార్తను ప్రకటించుచున్నారు. ఈ సందేశమంతయు ఒక్కటే అది సృష్టి ద్వారాను మనస్సాక్షి ద్వారాను మరియు లోకమందు జరుగు అనేక దుర్ఘటనల ద్వారాను ఆ సందేశము దృవపరచి చెప్పునది ఏమనగా **పశ్చాత్తాపపడుడి**!1

సువార్తీకరణ చేయు విషయములో మనము సువార్త సేవ చేయు దానికిని దేవుడు, పని చేయు దానికిని చాలా వ్యత్యాసము కలదు. దేవుడైతే ప్రతి దినము, ప్రతి క్షణము, ప్రతి మనుష్యునికి అతడు లేక ఆమె జీవిత కాలమంతయు దేవుడు వారికి సువార్తను ప్రకటించుచూనే ఉన్నాడు. ఎంత గొప్ప సువార్తికులైనను మానవులు కేవలము కొన్ని వందల మందికో లేక కొన్ని వేల మందికో దశాబ్దముల తరబడి సువార్త ప్రకటించుదురు. ఆ ఒక్కసారి ఆ కొద్ది సమయములో ప్రకటించబడిన సువార్తను మనుష్యులు అంగీకరించనప్పుడు ఆ పట్టణము వెలుపటనా, ఆ గ్రామము వెలుపటనా లేక ఆ గృహము వెలుపటనా ఆ పాదముల దుమ్మును దులిపివేయుదురు (మత్తయి 10:14). అయితే దేవుని సువార్త పనిని మనము గమనించిన యెడల దేవుడు నిరంతరము ఈ ప్రపంచమంతటికి ఎంతో నాటకీయముగా వారి అంతరంగములను ఒప్పింపచేయు విధముగా సువార్త ప్రకటించుచూనే ఉండును. మనము చేయు సువార్త పని, దేవుని పనితో ఏ మాత్రము పోల్చదగినది కాదు.

మన సువార్త సేవ బాధ్యత మనము సరియైన విధముగా అర్థము చేసుకొనుటకు దేవుని సువార్త సేవ విధానమును మనము అర్థము చేసుకొనిన యెడల దేవుని రాజ్యమును నిర్మాణము చేయు సువార్తీకరణ కార్య క్రమములు బాధ్యతాయుతముగా మనము చేయగలుగుదుము. మన సువార్త సేవలో మన పాత్రను చాలా ప్రత్యేకముగా గ్రహించుకొనవలెను. మరియొక ప్రాముఖ్యమైన అంశము ఈ సువార్త సేవలో మనము విస్మరించరానిది ఒకటి కలదు.

ఇంతకు మునుపు ప్రస్తావించినట్లు పశ్చాత్తాపపడుట మరియు నమ్ముట అను సంగతులు ప్రజల హృదయములకు సంబంధించినవి. ప్రతి మనుష్యులు దేవుని యెదుట తన్ను తాను తగ్గించుకొని తమ హృదయములు మెత్తన చేసుకొని పశ్చాత్తాపపడి ప్రభువైన యేసుక్రీస్తును విశ్వసించు వలెనని దేవుడు ఎంతగానో కోరుచున్నాడు. ఇందులో తెలుపబడిన విధములుగానే కాకుండా ఇంకా అనేక విధములుగా దేవుడు మనుష్యుల హృదయములో పనిచేయుచు వారు సువార్తను విని క్రీస్తు నందు విశ్వసించవలెనని దేవుడు కోరుచున్నాడు. ప్రతి మనుష్యుని హృదయ స్థితిని దేవుడు నిశ్చయముగా ఎరిగియున్నాడు. ఎవరి హృదయములు మెత్తవి అవుచున్నావో, ఎవరి హృదయములు కఠినపరచబడుచున్నవో దేవునికి తెలియును.

ఎవరు నిరంతరముగా వారి అంతరంగములో ప్రతిధ్వనించుచున్న దేవుని సందేశములను వినగలుగుచుండిరో, మరెందరు దేవుని స్వరము వినక దాన్ని త్రోసివేయుచున్నారో దేవుడు తెలుసుకొనుచున్నాడు. వారి వారి జీవితములలో జరుగు ప్రమాదములు, దుర్ఘటనలు ఎట్లు వారి హృదయములను పశ్చాత్తాపముతో దేవుడు తట్టు తిరుగునట్లు చేయబడుచున్నవో ఆయన ఎరుగును. కొందరు పశ్చాత్తాపపడి మారుమనస్సు పొంది దేవుని తట్టు తిరుగక వారి హృదయమును ఎట్లు కఠినపరచుకొందురో దేవునికి తెలియును. యిర్మియాతో మూడు పర్యాయములు దేవుడు ఇశ్రాయేలు వారు తమ హృదయములను కఠినపరచుకొని పశ్చాత్తాపపడుటకు ఏ మాత్రము అవకాశము లేనంత దూరముగా ఉన్నారు గనుక వారి నిమిత్తము ప్రార్థన చేయవద్దని తెలియజేసెను (యిర్మియా 7:16; 11:14; 14:11)[102] ఎవరి హృదయములు మెత్తగా చేయబడియున్నవో అట్టి హృదయములను పరిశుద్ధాత్మ వారిని ఒప్పింపచేసి పశ్చాత్తాపములోనికి తత్ఫలితముగా నడిపించగలుగునో అది దేవునికి తెలియును.

ఈ పై విషయములన్నియు మనము మనస్సులో ఉంచుకొని దేవుని రాజ్యము నిర్మించుట యందును మరియు సువార్త ప్రకటించుట యందును క్రైస్తవ సంఘము ఎట్టి బాధ్యతలు కలిగియుందురో మనము నేర్చుకొనునట్లు మనము ఏమి చేయవలెను?

## సూత్రము - 1

మహా గొప్ప సువార్తికుడు దేవుడు సువార్తిక కార్యమంతటిలో 95 శాతం అవిశ్రాంతముగా ఎంతో ఆసక్తితో ప్రతి దినము పనిచేయుచు ప్రతి వ్యక్తి జీవితములో ప్రతిధ్వనించునట్లు మాట్లాడుచు ఎవరి హృదయములైతే మెత్తవి చేయబడి సువార్తను అంగీకరించుటకు సిద్ధమనసు కలిగియున్నారో అట్టివారికి సువార్తను ప్రకటించుటకు తన సేవకులను ప్రతి దినము పంపించుచు ఎవరు సువార్తను అంగీకరించుటకు ఆసక్తి లేకున్నారో వారికంటే విని అంగీకరించు వారి దగ్గరకే ఎక్కువగా పంపుచున్నారు. అలాగు చేయుట యుక్తమైనదిగా దేవునికి కనబడుచున్నదని భావించవచ్చును.

గొప్ప సువార్తికుడైన దేవుడు, ప్రతి క్షణము జనుల జీవితములకు ప్రతి దినము సువార్తను బోధించుచు ఎవరైతే సువార్త వినుటకు ఆసక్తి చూపక అంగీకరించలేని స్థితిలో ఉండి సువార్త వినుటకు ఎన్ని అవకాశములు వారికి కలిగినను వారి యొద్దకు తన సేవకులను పంపు విషయములో సంవత్సరముల తరబడి ఆయన పడు ప్రయాసకు ఫలితమేమి? అట్టివారు కనీసం 5 శాతం అయినను వారు ప్రకటించు వాక్యమును వినుటకు ఏ మాత్రము ఇష్టత చూపని వారి యెడల ఎందుకు తన శ్రమను, ప్రయాసను వృథా పరచుచున్నాడు? దేవుడు అట్టి వారిపై తన తీర్పును పంపుట ద్వారా ఒకవేళ వారి హృదయములు కఠినస్థితి నుండి మెత్తగా చేయబడునేమో. ఒకవేళ వారలాగు వారి హృదయములను మెత్తగా చేసుకొనిన యెడల

[102] దేవుని వాక్యము బోధించున దానికంటే ఎక్కువగా ఎవరు తమ హృదయములను (ఫరోవలె) కఠినపరచుకొందురో అట్టి వాని హృదయములను ఇంకను అంతకంతకు మరింత కాఠిన్యము చేయబడును. అట్టివారు పశ్చాత్తాపపడుట మారు మనస్సు పొందుట అనునది అసాధ్యమే.

తన సువార్తను ప్రకటించుకొనుటకు దేవుడు తన సేవకులను సువార్తను ప్రకటించుటకు పంపినయెడల సహేతుకముగా ఉండును.

మరి కొందరు చెప్పునది ఏమనగా ఎవరు పశ్చాత్తాపడరో వారి వద్దకు దేవుడు తన సేవకులను పంపుట వలన వారు వినకపోయినను ఆయన న్యాయ తీర్పులో వారు తప్పించుకొను సాకులేమియు లేకుండా వారికిని సువార్త ప్రకటించబడెను. తన సృష్టి అంతట ద్వారా ఎల్లప్పుడును దేవుడు తన్ను గూర్చిన సత్యమును బయలు పరచుకొనుచూనే ఉండెను. తన సృష్టి ద్వారాను దేవుని వాక్యము ద్వారాను వారికి దేవుని గూర్చిన ప్రత్యక్షత తెలియబరచుచుండగా వారు దేవుని యెదుట నిరుత్తురులై యుందురు (రోమా 1:20). అట్టివారి యొద్దకు దేవుడు తన సేవకులను పంపినను వారు తాము వినిన సువార్తకు జవాబుదారితనము కలిగియుందురు. ఇప్పుడు మరింత ఎక్కువగా వారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె బాధ్యత కలిగి యుందురు.

ఒకవేళ ఇది వాస్తవము అయినట్లయితే ఎవరు సువార్తను అంగీకరించు మనస్సు కలిగియుందురో అట్టివారి యొద్దకే దేవుడు తన సేవకులను పంపుచూ ఉండును. ఆయన సేవకులు కూడా ప్రార్థన పూర్వకముగా దేవుని జ్ఞానము కొరకు ప్రార్థించి వారి యొద్దకు వివేకముతో నడిపింపబడవలెను.

## లేఖనపూర్వకమైన ఉదాహరణ

ఈ సూత్రము ఎంతో రమణీయముగా సువార్తికుడైన ఫిలిప్పు పరిచర్యలో అపొ. కార్యముల గ్రంథమందు ఆచరణాత్మకముగా చూపబడెను. సమరయలో సువార్తను అంగీకరించు సిద్ధమనస్సు కలిగిన వారి యెదుట ఒక జనసమూహమునకు సువార్తను బోధించెను. అయితే అటు పిమ్మట ఒక దేవదూత ద్వారా ఒక ప్రత్యేకమైన రహదారి మార్గమందు ప్రయాణమై వెళ్ళవలసినది అని నిర్దేశించెను. ఎంతో ఆసక్తిగా సువార్తను అంగీకరించుటకు సిద్ధమనసుగల ఒక యోగ్యుడైన వ్యక్తిని ఫిలిప్పు మార్గమందు కలుసుకొనెను:

> ప్రభువు దూత- నీవు లేచి, దక్షిణముగా వెళ్లి, యెరూషలేమునుండి గాజాకు పోవు అరణ్యమార్గమును కలసి కొమ్మని ఫిలిప్పుతో చెప్పగా అతడు లేచి వెళ్ళెను. అప్పుడు ఐతియొపీయుల రాణియైన కందాకేక్రింద మంత్రియై ఆమెయొక్క ధనాగారమంతటి మీదనున్న ఐతియొపీయుడైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చియుండెను. అతడు తిరిగి వెళ్ళుచు, తన రథము మీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండెను. అప్పుడు ఆత్మ ఫిలిప్పుతో - నీవు ఆ రథము దగ్గరకు పోయి దానిని కలిసికొనుమని చెప్పెను. ఫిలిప్పు దగ్గరకు పరుగెత్తికొనిపోయి అతడు ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండగా విని - నీవు చదువునది గ్రహించుచున్నావా? అని అడుగగా, అతడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి, రథమెక్కి తనతో

కూర్చుండుమని ఫిలిప్పును వేడుకొనెను. అతడు లేఖనమందు చదువుచున్న భాగమేదనగా:

ఆయన గొఱ్ఱెవలె వధకు తేబడెను బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెపిల్ల ఏలాగు మౌనముగా ఉండునో అలాగే ఆయన నోరు తెరవకుండెను ఆయన దీనత్వమునుబట్టి ఆయనకు న్యాయవిమర్శ దొరకకపోయెను ఆయన సంతానము ఎవరు వివరింతురు? ఆయన జీవము భూమిమీదనుండి తీసివేయబడినది.

అప్పుడు నపుంసకుడు - ప్రవక్త యెవనినిగూర్చి యీలాగు చెప్పుచున్నాడు? తన్నుగూర్చియా, వేరొకని గూర్చియా? దయచేసి నాకు తెలుపుమని ఫిలిప్పునడిగెను. అందుకు ఫిలిప్పు నోరు తెరచి, ఆ లేఖనమును అనుసరించి అతనికి యేసునుగూర్చిన సువార్త ప్రకటించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు - ఇదిగో నీళ్ళు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చెను. వారు నీళ్ళలో నుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను; అతడు పిలిప్పును మరి యెన్నడును చూడలేదు (అపొ.కా 8:26-39).

ఆఫ్రికా దేశము నుండి యెరూషలేముకు దేవునిని ఆరాధించవలెనని ప్రయాణమై వచ్చి ఆధ్యాత్మికమైన ఆకలితో నిండిన ఒక మనుష్యుని ఫిలిప్పు పరిచర్య చేయుటకు దైవికముగా నడిపించబడెను. యెషయా ప్రవచన వాక్యములు వ్రాయబడి ఉన్న లేఖన భాగముల తోలు చుట్ట యొక్క ప్రతిని అతడు యెరూషలేములో కొనుగోలు చేసి అత్యంత ఆసక్తితో అతడు దానిని చదువుచుండెను. అతడు చదువు గ్రంథము యెషయా 53లోనిది. పాత నిబంధనలో ప్రాయశ్చిత్తార్థమైన క్రీస్తు తన్ను తానుగా అర్పించుకొనిన బలియాగమును గూర్చిన సంపూర్ణ వివరములు ఆ భాగమందు వ్రాయబడి ఉండెను. యెషయా ఎవరిని గూర్చి ఈ ప్రవచన వాక్యములు వ్రాసియున్నాడో అది ఆ పాఠకునికి అర్థము కాలేదు. అప్పుడు పరిగెత్తుతు తన రథమును వెంబడించుచున్న సువార్తికుడైన ఫిలిప్పు అతనికి కనబడెను. అతడు ఏమి చదువుచున్నాడో దానిని గూర్చి వివరముగా బోధించుటకు ఫిలిప్పు సంసిద్ధుడాయెను. మారు మనస్సు పొంది దేవుని తట్టు తిరుగుటకు ఇక్కడ ఒక ఆత్మ పరిపక్వమై రక్షణార్థమైన కోతకు సిద్ధముగా ఉండి ఉండెను. అతని హృదయము దేవునికి తెలియును గనుక దేవుడే అతని యొద్దకు పంపెను.

# ఒక శ్రేష్టమైన మార్గము

అప్పుడప్పుడు గాని లేక ఒక క్రమమైన విధానములో గాని సువార్తను అంగీకరించుటకు సిద్ధమనస్సు లేనివారివద్దకు వెళ్ళి వారికి సువార్త బోధించి వారు వినకపోవుట వలన నిరుత్సాహము పొంది విచారపడుట కంటే దేవుని ఆత్మ చేత నడిపింపబడి సువార్తను అంగీకరించుటకు సిద్ధమైన మనస్సు గలవారి యొద్దకు వెళ్ళుట వలన ఎంతో ప్రయోజనకరముగా ఉండును. ఈ లోకములోని ప్రతి ఒక్క వ్యక్తిని దేవుడు అనుదినము తన్ను గూర్చిన సత్యమును అతనికి ఎరుకపరచుకొనుచు అవిశ్రాంతముగా దేవుడు ప్రతి ఆత్మ కొరకు ప్రయాసపడుచున్నాడను సంగతి మనము మరవకూడదు. దేవుని సత్యమును అంగీకరించుటను గూర్చి ప్రజలు తమ మనస్సాక్షిని గూర్చి సరిగా ప్రశ్నించిన యెడల వారు దేవుని సత్యమును అంగీకరించిరో లేక తిరస్కరించిరో అనునది తేటతెల్లమగును.

మరియొక ఉదాహరణ కొర్నేలి తన ఇంటి వారందరితో పేతురు యొక్క సేవా పరిచర్యవలన దేవుడు వారి ఆత్మలను రక్షణ కొరకు సిద్ధపరచియుండగా ఈ సూత్రమును అనుసరించి వారు మారు మనస్సు పొందిరి. పేతురు ఈ దేవునిని అంగీకరించుటకు సిద్ధమనస్సుగల అన్యజనులకు బోధించుటకు అసమానమైన రీతిని ఆత్మ చేత నడిపించబడెను. కొర్నేలి దేవుని నమ్మకముగా వెదకుచు తన మనస్సాక్షి యొక్క స్వరమును విధేయతతో వినుచూనుండు ఒక మనుష్యుడని అతని ప్రార్థనా జీవితము అతని ధర్మ కార్యములను బట్టి దేవుని వలన కలుగు రక్షణకు అతని హృదయము సిద్ధపరచబడెను (అపొ.కా. 10:2) . దేవుడే పేతురును, కొర్నేలిని దగ్గరగా కలిపెను. తెరువబడిన హృదయముతో కొర్నేలి పేతురు వలన రక్షణ సందేశము విని మహిమాయుక్తమైన ఆ రక్షణను పొందెను.

మనము విజ్ఞతతో ప్రార్థించి, దేవుడు ఎవరెవరి హృదయములను అంగీకరించుటకు సిద్ధమనస్సు కలిగి యున్నారో వారి వద్దకు వెళ్ళుట యుక్తము. అట్లు సిద్ధ మనస్సు లేని వారి వద్దకు, వారి పట్టణములకు, వారి ప్రదేశములకు సువార్త ప్రకటించుటకు ప్రతి ఇంటికి, ప్రతి అపార్టుమెంటుకు, ప్రతి చౌరస్తాకు సువార్తికులను పంపు వివిధ సువార్త పథకములు రచించుట సమయము వృధా చేయుటయే అగును. ఒకవేళ పేతురు యెరూషలేములో ఒక మహా సభ ఏర్పరచుకొని అందులో సువార్త సేవా పథకములను సమావేశములు,సదస్సులు నిర్వహించుట కంటే మరియు ఫిలిప్పు సమరయలో గ్రామము వెంబడి గ్రామము సువార్త సేవా పరిచర్యను కొనసాగించినట్లయితే కొర్నేలి తన ఇంటివారితోను, ఐతియొపీయుడై నపుంసకుడు సువార్త వాక్య సత్యమును రక్షణను పొందకనే పోవుదురు.

సువార్తికులు, అపొస్తలుల వారు సువార్త ప్రకటన చేయునప్పుడు ఆ వాక్యము విను జన సమూహములో అంగీకరించుటకు సిద్ధమనస్సు కలిగిన వారుందురు, అంగీకరించుటకు సిద్ధమనస్సు లేని వారు కూడా ఉందురు. అయినప్పటికిని దేవుడు ఎక్కడ వారిని సువార్త ప్రకటించుటకు నడిపించుచున్నాడో అక్కడకు దేవుని నడిపింపు చొప్పున వెళ్ళి ప్రకటించవలెను. దేవుని రాజ్య నిర్మాణములో పరిశుద్ధాత్మ దేవుడు ఎడతెగక పనిచేయుచుండగా

అపొ.కా గ్రంథమందు వ్రాయబడినట్లు ఆత్మ చేత నడిపించబడి, ఆత్మచేత అభిషేకించబడిన సేవకుడు పరిశుద్ధాత్మ దేవునితో సహకరించి పనిచేయుచున్నాడు. ఆది క్రైస్తవ సంఘము యొక్క సేవా పద్ధతులు నేటి ఆధునిక సంఘము యొక్క సేవా పద్ధతులకు ఎంతయో వ్యత్యాసము కలిగి యున్నది. అలాగుననే వారి ఫలితములలో కూడా వ్యత్యాసమున్నది. విజయవంతముగా మంచి ఫలితమిలిచ్చు క్రైస్తవ సంఘ విధానములు మనము నేడు అవలంభించుట ఎంతయో ప్రయోజనకరము.

## సూత్రము - 2

బైబిలు సంబంధమైన ఈ సూత్రములను ఈ మొదటి భాగములో సువార్తికరణయందును దేవుని రాజ్య నిర్మాణము నందును మన పాత్ర ఎటువంటిదో ఆ మొదటి అధ్యాయమందు మనము చూచితిమి.

మానవాళికి పశ్చాత్తాపము కొరకు సృష్టిని పరికించుట మనస్సాక్షి స్వరము వినుట, దుర్ఘటనలు మున్నగు వాటిని దేవుడు ఇట్టి పరిస్థితుల ద్వారా తన పిలుపు వారికి తెలియజేయుచున్నారు. అందుచేత సువార్తను ప్రకటించువారు విభిన్నమైన సందేశమేదో ప్రకటించుచున్నామని తలంచరాదు. ***దేవుడు ఇప్పటికే పాపాత్ములైన మనుష్యులకు అనేక విధములైన పద్ధతుల ద్వారా తన సందేశమును తెలియజేయుచున్నను సువార్త ప్రకటించువారు కొన్ని పర్యాయములు దేవుడు ప్రకటించిన దానికి విరుద్ధముగా బోధించుచున్నారు***. బైబిలులో ఎక్కడను చెప్పబడని ఒక కృపను గూర్చి వారి అభిప్రాయములను వారు అత్యధికముగా ప్రసిద్ధిచేయుచు పరలోకములో చేరుటకు పరిశుద్ధత గాని దేవుని చిత్తమునకు విధేయత గాని అంత ప్రాముఖ్యమైనవి కావని అంతములో అందరూ రక్షింపబడుదురని ప్రకటించుదురు. అందుచేత రక్షణ పొందుటకు పశ్చాత్తాపము యొక్క అవసరత గూర్చి గాని రక్షణ అనునది క్రియల పూర్వకము కాదని వారే మాత్రము బోధించరు, (అలాంటి బోధ కేవలము అపార్థము చేసుకొనుట అగునని పౌలు భావము), వారు వాస్తవమునకు దేవునికి వ్యతిరేకముగా పనిచేయుచున్నారు. ప్రజలను లోతైన మోసములోనికి నడిపించి వారి ఆత్మలను నిత్య నాశనములోనికి త్రోసివేయబడుటకు ముద్రింపబడుచున్నారు. వారిప్పుడు రక్షింపబడుదురని భావించుచున్నారు గాని వాస్తవమునకు వారు ఏ మాత్రమును రక్షణ పొంది యుండలేదు. దేవుని వ్యతిరేకముగా పనిచేయు ఈ సేవకులు ఎంత విశాదకరమైన పరిస్థితిని మానవులకు కలుగజేయుచున్నారో కదా!

“పాపములు క్షమించబడుటకు పశ్చాత్తాపపడవలసినది” అని ప్రకటించుమని క్రీస్తు ఆజ్ఞాపించెను” (లూకా 24:17). దేవుడు ఒక పాపాత్ముడైన మనుష్యుని జీవితకాలమంతటిలో దేవుడు అతనికి వినిపించు ఈ సందేశమును పై మాటలు ధృవపరుచుచున్నవి. కఠిన హృదయములైన అనేక మంది మనుష్యులు ఈ సువార్త వలన హృదయములో గ్రుచ్చబడి, కోయబడినవారై దేవుని తట్టుకు తిరగగలిగిరి కాని నేటి ఆధునిక సువార్త సందేశములు దేవుడు నిన్ను ఎంత ప్రేమించుచున్నాడో అను మృదువైన మాటలతో బోధించి ఊరుకొనుచున్నారు

(అపొ.కా. ఏ అపొస్తలుడును ఇటువంటి మృదువైన బోధ చేయవలదు), కేవలము దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడు అని చెప్పుట వారు ఎట్టి దుర్మార్గ క్రియలు, దుర్నీతి ప్రవర్తనతో ఉన్నను దేవుడు వారి విషయమై ఆగ్రహము లేక కోపము లేక వారిని గూర్చి వేదన పొందడని వారు తప్పుగా భావించుచున్నారు. అనేక పర్యాయములు వారు, "యేసుక్రీస్తును అంగీకరించుట" అను ఒక సామాన్యమైన అవసరతను గూర్చి మాత్రమే బోధించి ఊరుకుందురు. రాజులకు రాజును, ప్రభువులకు ప్రభువైన ఆ దేవునిని మనము అంగీకరించు ఆవశ్యకతను గూర్చి వారే మాత్రము చెప్పరు. ఇప్పుడు ప్రశ్న, "నీవు యేసుక్రీస్తును అంగీకరించుచున్నావా?" అనునది కాదుగాని, "యేసుక్రీస్తు నిన్ను అంగీకరించుచున్నాడా?" అనునదే ప్రాముఖ్యమైన ప్రశ్న. అప్పుడు జవాబు నీవు మారుమనస్సు పొంది, పశ్చాత్తాపపడి ఆయనను వెంబడించుటకు ప్రారంభించని యెడల నీవు ఆయనకు హేయమైన వ్యక్తిగా ఉందువు. నీవు నీ భవిష్యత్తు ఆయన దయ చూపనియెడల నరకమే నీ అంతము.

నేటి ఆధునిక సువార్త దేవుని యొక్క కృపను బట్టి చౌకబారుదిగా చేయుచున్నది. అనేక దేశములు పరిపాలించు నాయకులకు దేవుడే వారికి పాలనాధికారము ఇచ్చుచున్నాడు. ఇది మనకెంతయో ఆశ్చర్యకరముగా ఉండును (ఇది కేవలము చర్చకొరకు కాదు, దానియేలు 4:17, 25; 3:21; 5:21; యోహాను 19:11; అపొ.కా 12:23; రోమా 13:1). కొన్ని దేశములు పాశ్చాత్య మిషనరీలు సువార్త ప్రకటించుటకు ఏమాత్రము అవకాశమియ్యక వారికి తలుపులు మూసివేసినది. ఒకవేళ మోసపరచు సువార్త ఆయా దేశములోనికి వెళ్ళకుండా ఒకవేళ దేవుడే వారి తలుపులను మూసివేసి ఉండవచ్చును.

## సూత్రము - 3

ఇంతకు ముందు అధ్యాయములలో మనము చూచునట్లు అబద్ధపు మతములను వెంబడించు ప్రజలపట్ల దేవుని యొక్క అభిప్రాయములు ఏ విధముగా ఉండునో మనము గ్రహించుటకు ఆ అధ్యాయములు సహాయకరముగా ఉండును. వారు దేవుని గూర్చిన సత్యము ఎన్నడును వినలేదు కనుక వారు అమాయక ప్రజలని జాలి చూపించబడుదురా? వారికి సమర్థవంతముగా సువార్త సత్యమును బోధించలేదని, ఆ నేరమంతయు క్రైస్తవ సంఘమునదే అని భావింపబడునా?

అలాగు కాదు, కాని దేవుని సత్యమును వారు ఏ మత్రమైనను ఎరుగని వారు కాదు. బైబిలు నమ్ము విశ్వాసులకు తెలిసినదంతయు ఒకవేళ ఇతర మతస్తులకు తెలియకపోవచ్చును. అయితే సృష్టి ద్వారాను, మనస్సాక్షి ద్వారాను ప్రపంచమందు సంభవించు దుర్ఘటనల ద్వారాను తన్ను గూర్చి ఆయన బయలు పర్చుకొనునది వారు ఎరుగుదురు. వారి జీవితకాలమంతయు పశ్చాత్తాపపడుడని దేవుడు వారిని ఎల్లప్పుడు పిలుచుచూనే ఉన్నాడు ఒకవేళ వారు ఒక క్రైస్తవుడునైను చూచి ఉండక పోవచ్చును లేక సువార్తను ఎన్నడును వినియుండక పోవచ్చును. దీనికి పైగా వారి హృదయములు దేవుడు అంగీకరించుటకు మెత్తగా చేయబడుటకు గాని లేక కఠిన పరచబడుట గాని జరుగును.

అవిశ్వాసులైన వారి యొక్క అమాయకత్వమును గూర్చి పౌలు వ్రాయుచు వారెందుకు సువార్తను ఎరుగక అమాయకముగా ఉన్నారో బయలుపరచు ఒక కారణము చూపెను:

కాబట్టి అన్యజనులు నడుచుకొనునట్లు మీరికమీదట నడుచుకొనవలదని ప్రభువునందు సాక్ష్యమిచ్చుచున్నాను. వారైతే అంధకారమైన మనస్సుగలవారై తమ హృదయ కాఠిన్యమువలన తమలోనున్న అజ్ఞానముచేత దేవునివలన కలుగు జీవములోనుండి వేరుపరచబడినవారై, తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి నడుచుకొనుచున్నారు. వారు సిగ్గులేనివారైయుండి నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకు తమ్మును తామే కాముకత్వమునకు అప్పగించుకొనిరి (ఎఫెసీ 4:17-19).

“వారి హృదయ కాఠిన్యము వలనే” అన్య జనులు సువార్త సత్యమును గూర్చి ఏ మాత్రమును ఎరుగనటువంటి అమాయకులై యున్నారని కారణము తెలియజేయుచున్నాడు. వారు కేవలము సువార్త నిమిత్తమై నిర్లక్ష్యముగా ఉండిరని పౌలు తెలియజేయుచున్నాడు. వారి హృదయము యొక్క పరిస్థితిని గూర్చి పౌలు వివరించుచున్నాడు. మృదువైన దేహ చర్మము మొద్దుబారి చాలా కరుకుగా తయారయై స్పర్శ జ్ఞానము ఏమియు లేకపోవును. అలాగుననే సృష్టిద్వారా, మనస్సాక్షి ద్వారా మరియు దుర్ఘటనల ద్వారా ప్రజలు ఎల్లప్పుడును దేవుని పిలుపును వినుచుండినను నిర్లక్ష్య పెట్టుట వలన క్రమ క్రమముగా దేవుని స్వరము వినగల వారి వినికిడి మందగించి పోయి. ఇకనేమాత్రం దేవుని పిలుపు విననేరకుండునట్లు కఠినమైపోవును. అందుచేత వయస్సు పెరుగుచున్న కొలది అనేక మనస్సులు మొండిబారిపోయి వారునెంతమాత్రము దేవుని స్వరమునకు ప్రత్యుత్తరము చెప్పలేని స్థితిలో ఉందురు. వయో వృద్ధుడగు కొలది ఒక వ్యక్తి పశ్చాత్తాపపడుటకు ఎక్కువ అవకాశముండదు. ***తెలివిగల సువార్తికులు యౌవన గుంపులు గలవారిని తనకు గురిగా ఏర్పరచుకొందురు.***

## అవిశ్వాసము వలన కలుగు దోషారోపణ భావన

క్రైస్తవ సువార్తికుని ద్వారా కనీసము వారి జీవితములో ప్రజలు ఒక్కసారియైనను, సువార్త వినకపోయినను దేవుడు ఆ ప్రజలను దోషులుగా ఎంచుటకు కారణము దేవుడు వారి జీవితములలో చురుకుగా పనిచేయుచు వారికి తీర్పు తీర్చును. వారి పాపముల విషయమై బాధ్యత వహించి లెక్క ఒప్పచెప్పవలసిన వారిగా ఉన్నారు గనుక. దేవుడు వారిని శిక్షించుచున్నాడు. ఒకవేళ ఆయన శిక్షింపక పోయినయెడల ఆయన వారి పాపముల విషయమై వారు బాధ్యతలో లెక్క ఒప్పచెప్పవలసినదిగా ఎంచడు. వారు ఆయనకు సంతోషము కలుగజేయని క్రియలు చేయుచున్నారని వారు ఎరుగునట్లు దేవుడు వారిని శిక్షించుచున్నాడు.

పశ్చాత్తాపము కొరకైన తన పిలుపును నిరాకరించు వారిని దేవుడు శిక్షించు విధానమేదనగా వారి పాపదురాశలకు వారిని అప్పగించు వేయుట ద్వారా వారు ఇంకను మిక్కిలి అధమమైన హీన స్థితికి దిగజారిపోవుచున్నారు.

మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచ
లేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు గాని తమ వాదములయందు

వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకారమయమాయెను; తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయముగు మనుష్యులయొక్కయు, పక్షులయొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగులయొక్కయు, ప్రతిమాస్వరూపముగా మార్చిరి.

ఈ హేతువుచేత వారు తమ హృదయముల దురాశలను అనుసరించి, తమ శరీరములను పరస్పరము అవమాన పరచుకొనునట్లు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించెను. అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి, సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు, ఆమెన్. అందువలన దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించెను. వారి స్త్రీలు సయితము స్వాభావికమైన ధర్మమును విడిచి స్వాభావిక విరుద్ధమైన ధర్మము అనుసరించిరి. అటువలె పురుషులు కూడ స్త్రీయొక్క స్వాభావికమైన ధర్మము విడిచి, పురుషులతో పురుషులు అవాచ్యమైనదిచేయుచు, తమ తప్పిదమునకు తగిన ప్రతి ఫలమును పొందుచు ఒకరియెడల ఒకరు కామతప్తులైరి.

మరియు వారు తమ మనస్సులో దేవునికి చోటియ్య నొల్లకపోయిరి గనుక చేయరాని కార్యములు చేయుటకు దేవుడు భ్రష్ట మనస్సుకు వారినప్ప గించెను. అట్టివారు సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వముచేతను, లోభము చేతను, ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము నరహత్య కలహము కపటము వైరమువాటితో నిండినవారై కొండెగాండ్రును అపవాదకులును, దేవద్వేషులును, హింసకులును, అహంకారులును, బింకములాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రుల కవిధేయులును, అవివేకులును మాట తప్పువారును అనురాగరహితులును, నిర్దయులునైరి. ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగా ఎరిగియుండియు, వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించు వారితో సంతోషముగా సమ్మతించుచున్నారు (రోమా 1:21-32).

మానవుని దోషము విషయమై అతడు ఎట్లు జవాబు దారితనము దేవుని యెదుట కలిగియున్నారని విషయము పౌలు గట్టిగా నొక్కి వక్కాణించుచున్నాడు. తిరిగి నూతనముగా జన్మించినటువంటి వారు దేవునిని ఎరిగియుండియు ఆయనను దేవుడిగా గౌరవించలేదు లేదా కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు. "వారుదేవుని సత్యమును అబద్ధమునకు మార్చిరి." కనుక

వారు దేవుని సత్యమును ఎదుర్కొనియైయుండిరి. అందుచేత నిరంతరము వారు అంతకంతకు హేయమైన దుస్థితికి దిగజారిపోవుచూ నుండిరి. వారు ఎంత నీచస్థితికి దిగజారిపోయిరనగా పాపములో వారు బహు ఘోరమైన దాస్యములో చిక్కుబడి అసహజమైనట్టియు, భ్రష్టమైనట్టియు,హేయమైన పాపకార్యములు చేయుచునుండిరి. ఒకవేళ దేవుడు ఈలాగు వారితో చెప్పుచుండవచ్చును, ''నన్ను సేవించునట్లుగా మీరు పాపమును సేవించుటకు ఇష్టపడుతున్నారు. నేను మిమ్మును ఏ మాత్రము ఆపుచేయను. మీరు అలాగే ముందుకు వెళ్ళవచ్చును మరియు ఏ పాపదేవతను మీరు ప్రేమించుచున్నారో ఆ పాపమునకు మీరు బానిసలై అంతకంతకును ఆ దేవతకు లోబడి పోవుదురు.''

కొన్ని పర్యాయములు దేవుడు వారి పాపములలో వారింకను యదేచ్ఛగా చేయుచు ముందుకు సాగిపోవుట ఇది ఒక రకమైన దేవుని తీర్పు అనియు ఆ విషయములో దేవుడు చూపించు ఉపేక్ష ఆయన దయయని వారు భావించుట అవకాశము కలదు. ప్రజలు అంతకంతకు పతనమై వారి పాపములలో భ్రష్టస్థితిలోనికి వెళ్లిపోయిన తరువాత ఎప్పుడైనను తమ దుస్థితిని వారు గ్రహించి దానిలో నుండి మేల్కొనుటకు ప్రయత్నించుదురు. ఈ పురుషసంయోగులైన వారు ''తాము ఎందుకు ఇటువంటి దురలవాటులకు లోనై తమ స్వజాతీయులతోనే ఇటువంటి లైంగిక సంబంధము తాము ఎందుకు కోరుకొనుచున్నామో'' అని తమ్మును తాము ప్రశ్నించుకొనరో అనునది బహు ఆశ్చర్యము కలిగించు ప్రశ్నయైయున్నది. ఒక విధముగా చూస్తే దేవుడు ఎందుకు ''వారిని ఆ విధమైన ఆశలతో కలుగజేసెను'' అనునది చర్చనీయాంశమే. వారికి ఇంత విచ్చలవిడిగా పాపము చేయుటకు విడిచిపెట్టుటకు ఒక కారణము వారు ఎంత లోతుగా పాపములో కూరుకొనిపోవుదురో వారు ఆ స్థితిలో మేల్కొని తమ దుస్థితిని వారు గ్రహించిన పిమ్మట వారు ఎంతగానో తమ పాపము విషయమై పశ్చాత్తాపపడి దేవుని యొక్క అద్భుతమైన దయను అనుభవింపగలుగుదురు.

కేవలము పురుషసంయోగులు మాత్రమే తమ్మును తాము ప్రశ్నించుకొను వారు కాకుండా పౌలు బానిసత్వములోనికి ఈడ్చుకొనిపోవు అనేక ఇతర పాపముల జాబితాను వివరముగా వ్రాసి ఇట్టి పాపములు చేయు వారందరు దేవుని పిలుపును త్రోసివేసి ఆయన తీర్పు క్రిందికి వచ్చుచున్నారు. కోట్లకొలది ప్రజలు తమ దుర్నీతి పాపము విషయమై తమ్మును తాము ప్రశ్నించుకొనవలసిన వారుగా ఉన్నారు, ''నా కుటుంబమును నేనెందుకు ద్వేషించుచున్నాను?'' ''వ్యర్థమైన సంభాషణలో నేనెందుకు ఎక్కువ సమయమును వృధా చేయుచున్నాను?'' ''నాకు కలిగియున్న దానితో నేనెందుకు సంతృప్తిగా ఉండలేకపోవుచున్నాను?'' ''నేనెందుకు అత్యంత ఆసక్తితో బూతు బొమ్మలను చూడవలెనని కోరిక కలిగియున్నాను?'' మనుష్యులు తమ హృదయములో పాప సంబంధమైన వాంఛలతో ఎటువంటి పాపదేవతను ఆరాధించవలెనని కోరుదురో దేవుడు వారిని స్వేచ్ఛగా వారి ఇష్టానుసారముగా చేయుటకు విడిచిపెట్టుచున్నాడు.

అయినప్పటికీ ఏ మనుష్యులైనను ఎంత ఘోర పాపస్థితిలో ఉన్నను తన

హృదయమును మెత్తనిదిగా చేసుకొని పశ్చాత్తాపపడి యేసునందు విశ్వాసము ఉంచవచ్చును. ఈ భూమండలమందు ఎంతో కఠినాత్ములైన పాపులు అలాగు తమ హృదయమును మెత్తనిదిగా చేసుకొని పశ్చాత్తాపపడి క్రీస్తును నమ్మిరి. దేవుడు వారి పాపముల నుండి వారిని కడిగి వారికి విడుదల కలుగజేసెను. మనుష్యులు ఇంకను ఊపిరి కలిగియుండగానే పశ్చాత్తాపపడి దేవుని వైపునకు వారు తిరుగుటకు అవకాశము దేవుడు ఇంకను వారికి ఇచ్చుచున్నాడు.

## ఇక సాకులు చెప్పుటకు వీలులేదు

పౌలు వాక్యమును అనుసరించి పాపులకు ఇంక సాకులు చెప్పు అవకాశమే లేదు. తప్పుఒప్పులను వారు గ్రహించి ఇతరుల తప్పొప్పులను వారు విమర్శ చేయగలుగుచున్నారు. అందుచేత వారు దేవుని యొక్క శిక్షావిధి కిందికి వచ్చి యున్నారు:

> కాబట్టి తీర్పు తీర్చు మనుష్యుడా, నీవెవడవైనను సరే నిరుత్తరడవై యున్నావు. దేని విషయములో ఎదుటి వానికి తీర్పు తీర్చుచున్నావో దాని విషయములో నీవే నేరస్థుడవని తీర్పు తీర్చుకొనుచున్నావు; ఏలయనగా తీర్పు తీర్చు నీవును అట్టి కార్యములనే చేయుచున్నావు కావా? అట్టి కార్యములు చేయువారిమీద దేవుని తీర్పు సత్యమును అనుసరించినదే అని యెరుగుదుము. అట్టి కార్యములు చేయువారికి తీర్పు తీర్చుచు వాటినే చేయుచున్న మనుష్యుడా, నీవు దేవుని తీర్పు తప్పించు కొందువని అనుకొందువా? లేదా, దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘశాంతమును తృణీకరించుదువా? (రోమా 2:1-4).

ప్రజలు పశ్చాత్తాపపడుటకు దేవుడు అవకాశమిచ్చుచున్నాడు గనుక దేవుడు వారి విషయమై ఎంతో ఓర్పు సహనమును కనబర్చుచున్నాడను కారణమును పౌలు తెలియజేయుచున్నాడు. ఎవరైతే పశ్చాత్తాపపడి పవిత్రమైన జీవితములు జీవించుచున్నారో వారు దేవుని రాజ్యములోనికి హక్కుదారులుగా ప్రవేశింపగలుగుదురని పౌలు బయలు పరచున్నాడు.

నీ కాఠిన్యమును, మార్పు పొందని నీ హృదయమును అనుసరించి, ఉగ్రత దినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలు పరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చు కొనుచున్నావు. ఆయన ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును. సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును. అయితే భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును. దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు, మొదట యూదునికి గ్రీసుదేశస్థునికి కూడా, శ్రమయు వేదనయు కలుగును. సత్ క్రియ చేయు ప్రతివానికి, మొదట యూదునికి గ్రీస్దుఏస్థునికికూడా, మహిమయు

ఘనతయు సమాధానమును కలుగును (రోమా 2: 5-10).

"యేసుని రక్షకునిగా అంగీకరించునంత" మాత్రమున వారికి నిత్యజీవము దొరుకునను బోధచేయు వారితో పౌలు ఏ మాత్రమును ఏకీభవించుట లేదు. కాగా ఎవరైతే పశ్చాత్తాపపడుదురో వారు "ఓర్పుతోను సహనముతోను, పట్టుదలతోను సత్ క్రియలు చేయుచు మహిమను గౌరవమును, అమర్త్యతను వెదుకువారై యున్నారు."

క్రైస్తవ మతమునకు చెందకుండా వేరు ఇతర మతములలో తమ భక్తి జీవితమును కొనసాగించువారు వారు పశ్చాత్తాపపడి దేవుని తట్టు తిరిగి విధేయులైన యెడల వారు కూడా రక్షింపబడవచ్చును. రక్షింపబడవచ్చునని ఈ పై సూత్రము సూచించుచున్నదా?

అలాగు వీలులేదు. యేసు ద్వారానే తప్ప వేరు ఇతర కారణములను బట్టి రక్షణ ఎవరును పొందజాలరు. పాప బానిసత్వమునుండి కేవలము యేసు మాత్రమే వారికి విడుదల కలుగజేయువారు.

ఇతర మతములలోని వారు ఒకవేళ వారు వారి దుష్ట పాపకార్య విషయమై పశ్చాత్తాపపడినను ఒకసారి కూడా యేసును గూర్చి వినకుండా వారెట్ల రక్షణ పొందగలరు?

ప్రజల హృదయములను ఎరిగియున్న దేవుడు ఎవరైతే తమ్మును ఆసక్తితో వెదుకుదురో వారికి తన్ను తాను ప్రత్యక్ష పరచుకొనును. యేసు వాగ్దానము చేసినట్లుగా "వెదకుడి మీకు దొరకును" (మత్తయి 7:7), మనుష్యులందరూ దేవుని వెతకవలెనని దేవుడు కోరుచున్నాడు (అపో. 17:26-27 చూడుము). దేవుడు అవిశ్రాంతముగా చేయుచున్న సువార్తిక ప్రయత్నమునకు ఎవరి హృదయము ప్రతిస్పందించుట దేవుడు చూచునో అతని యొద్దకు దేవుడు తన సువార్తను పంపును. ఐతోపీయుడైన నపుంసకుని యొద్దకును, కొర్నేలి ఇంటివారి వద్దకును యేలాగు రక్షణ సువార్తను పంపియున్నాడో, అలాగు వారి వద్దకు పంపును. కేవలము క్రైస్తవ సంఘము యొక్క పరిచర్య కొరకు మాత్రమే దేవుడు తన్ను పరిమితులలో ఉంచుకొనడు. తార్సువాడైన పౌలును రక్షణ నడిపించుటలో దేవుడు దానిని రుజువు పరచెను. యదార్థమైన హృదయముతో వెదకుచున్న వాని వద్దకు దేవుడు సువార్త సత్యమును పంపును లేదా దేవుడు స్వయముగా వారికి ప్రత్యక్షుడగును. అనేక దేశములలో ఎక్కడ సువార్త ప్రచారమునకు తలుపులు మూయబడి ఉన్నవో ఆ ప్రదేశములలో కూడా యేసు స్వయముగా అక్కడి జనులకు తన్ను తాను ప్రత్యక్షపరచుకొని వారికి రక్షణ ఇచ్చిన అనేక సంఘటనలు నేటి సమకాలిన పరిస్థితులలో అనేకం కలవు.

## ఎందుకు ప్రజలు మతాసక్తికలిగి ఉన్నారు?

ఈ అబద్ధ మతములను అభ్యసించు వారు వాస్తవమునకు నిజమైన సత్యాన్వేషకులు కాదు. వారి పాపములను ఏదో ఒక విధముగా కప్పివేసుకొనుటకును వాటిని న్యాయమైనట్లుగా సమర్థించుకొనుటకును వారు ఒక మత సంబంధమైన ముసుగును ఆశ్రయించుచున్నారు. వారి మనస్సాక్షి యొక్క గద్దింపులను వారు పదే పదే అలక్ష్యము చేయుచు అంతరంగ ధర్మ విధిని అతిక్రమించుచున్నారు. అయితే వారు ఈ మతము యొక్క ముసుగు వెనుక తమ్మును

మరుగు చేసుకొనుచున్నారు. వారి తీవ్రమైన మతాసిక్తి, మతాచార పారాయణత్వమును బట్టి తామెంత మాత్రము   నరకపాత్రులము కామని తమ్మును తాము ఒప్పించుకొనుటకు ప్రయత్నించుచుదురు. క్రైస్తవ మతములో కూడా ఇటువంటి వెలుపటి మతాచార భక్తి గలవారు కూడా కలరు. అట్టివారు దేవుని కృపను చాలా చౌకబారుగా ఉపయోగించుకుందురు. అలాగుననే బౌద్ధ మతస్థులు ముహమ్మదీయులు మరియు హిందువులు దేవుని కృపను చాలా తేలికైనదిగా భావించుకొందురు. వారెంతగా వెలుపట మతాచార భక్తిని ప్రదర్శించినను ఆంతర్యములో వారి మనస్సాక్షి వారిని గద్దించుచునే ఉండును.

బౌద్ధమతస్థులు ఎంతో వినయముగా తమ బుద్ధ విగ్రహముల యెదుటను, గర్వముగా కూర్చుండు వారి బౌద్ధమత సన్యాసుల యెదుటను ఎంతో హృదయపూర్వకముగా వంగి నమస్కరించుదురు. కాని లోపట వారి మనస్సాక్షి వారిని గద్దించుచునే ఉండును. ఒక హిందువు వ్యాధిగ్రస్థులైన ఒక భిక్షగానిని చూచి ఏ మాత్రము కనికరము చూపక అతను పూర్వము జన్మములో చేసుకొనిన పాపము యొక్క దుష్ఫలితములను ఇప్పుడు అనుభవించుచున్నాడని సమర్థించుకొని ముందుకు సాగిపోవును గాని ఏ మాత్రము దయను, జాలిని అతని పట్ట చూపరు. అలాగుననే అల్లా పేరు మీద ఒక నాస్థికుడైన మనుష్యుని ఒక ముహమ్మదీయుడు శిరస్సు నరికి అతనిని చంపివేయును. అతని మనస్సాక్షి నీవు నరహంతకుడవని ఘోషించు ధ్వనికి తన మతాసక్తి వేషధారణ ముసుగుతో కప్పివేయును. తానెంతో సువార్తిక దృక్పదము గల విశ్వాసిని అని ఒక క్రైస్తవుడు చెప్పుకొనుచు ఈ లోక సంబంధమైన సిరిసంపదలను అన్యాయముగా పోగుచేసుకొనుచు టెలివిజన్‌లో అశ్లీలమైన శృంగార సంబంధమైన దృశ్యములను చూచుచు తన తోటి సంఘ సభ్యులను గూర్చి అనవసరమైన వృధా సంభాషణలు చేయుచు తాను కృపద్వారా రక్షింపబడుదురనియు డంబములు చెప్పుకొను విశ్వాసి అతని మనస్సాక్షి అతనిలో తాను తప్పు చేయుచున్నా గద్దించుచూనే ఉండును. ఈ పై చెప్పబడిన ఉదాహరణలు అన్నియు వారు యదేచ్ఛగా పాపము చేసుకొనుటకు ఈ మత సంబంధమైన భక్తి ఆచారములు అను అబద్ధపు వేషదారణ ముసుగులతో వారు తమ పాప జీవిత క్రియలను కొనసాగించుచూనే ఉందురు. మారు మనస్సు పొందక తిరిగి జన్మించునని అనుభవము లేని బాహ్య మతాచార సంబంధమైన ప్రజలు “నీతిమంతులముగా”బయటకు కనబరచుకొని కోరి దేవుని యొక్క ఆత్మీయ ప్రామాణికములకు చాలా దూరముగా జీవించుచున్నారు.

ఈ అబద్ధ మత సంబంధమైన జీవితములను వెంబడించుచున్న ప్రజలు చాలా అమాయకులని వారు కనీసము ఒక్కసారి కూడా సువార్త వినలేదని వారి మీద దయతలచవలసిన ఆవశ్యకత ఉన్నదని దేవుడు ఎంత మాత్రము నిరపరాధులనుగా ఎంచడు. వారి నిర్దోషత్వము విషయమై వాస్తవమునకు క్రైస్తవ సంఘమును నిందించవలసిన అవసరత కలదు ఎందుకనగా వారు తగినంత శ్రద్ధాసక్తులతో వారికి సువార్త అందించలేకపోయిరి.

క్రైస్తవ సంఘము లోకములోని జనులందరికి సువార్త ప్రకటించ వలసిన బాధ్యత వారిపై కలదని దేవుడు వారిని సువార్త ప్రకటించుటకు ఆదేశించుచున్నాడను సంగతి అందరూ

ఎరిగినదే. "ఎక్కడ పొలములు తెల్లబారి కోతకు సిద్ధమై యున్నవో అక్కడ పరిశుద్ధాత్మ నడిపింపుతో ఆత్మల పంట కూర్చవలసి ఉన్నది" (యోహాను 4:35), దేవుడు వారి హృదయములలో అవిశ్రాంతముగా పనిచేయుచు వారి మనస్సులను మెత్తనివిగా చేయుట వలన వారు సువార్తను అంగీకరించుటకు సిద్ధమైన మనస్సు కలగియుందురు. అట్టివారి యొద్దకు సువార్తను ప్రకటించి వారిని దేవుని రాజ్యములోనికి నడిపించుట సులభమగును.

## సూత్రము - 4

ఈ చివరి సూత్రము ద్వారా మనము నేర్చుకొను బైబిలు సత్యము మనము ఇంత క్రితము చూచునట్టి అంశమే. జనులను హృదయములను మెత్తనివిగా చేయుటకు దేవుడు పాపులైన వారిని కఠినమైన తీర్పులతో శిక్షించుట ద్వారా పనిచేయుచున్నాడు. కొంతమంది పాపులు తీవ్రమైన దేవుని తీర్పులతో శిక్షించుట ద్వారా పనిచేయుచున్నాడు. కొంతమంది పాపులు తీవ్రమైన దేవుని తీర్పుల వలన కఠినముగా శిక్షించబడి హృదయ కాఠిన్యమును విడిచి హృదయము మెత్తగా చేయబడుట వలన దేవుని తట్టు తిరుగుచున్నారు. మరి కొంతమంది ఇతరుల దేవుని తట్టు తీర్పును, శిక్షను అనుభవించు చూచి వారి హృదయములను మెత్తనివిగా చేసుకొని దేవుని తిరుగుచున్నారు. ఇంతకు ముందు కఠిన హృదయులై సువార్తను అంగీకరించనివారు. ఈ దుర్ఘటనలు అనుభవించి దేవుని తట్టుకు తిరుగుటకు ఇవి కొన్ని అవకాశములుగా మారును.

ఎక్కడ ప్రజలు తీవ్రమైన బాధలు, కష్టములు అనుభవించుచుందురో ఆ ప్రదేశములలో సువార్తను ప్రకటించి వారిని దేవుని వైపునకు నడిపించు అవకాశములను ఉపయోగించుకొనవచ్చును. వరదలు, తుఫానులు భూకంపములు మరి ఇతర దుర్ఘటనలలో తమ ప్రియులను కోల్పోయిన వారిని దేవుని వాక్యము వినుటకు వారు మరి ఎక్కువగా తమ మనస్సులను తెరచుకొని ఆశతో దేవుని సహాయము కొరకు చూచుచుందురు. అట్టివారు సిద్ధమనస్సుతో దేవుని వాక్యమును అంగీకరించును. సంఘ కాపరిగా నేను అనేక సందర్భములలో ముఖ్యముగా భూ స్థాపన కార్యక్రమముల సమయమందు సువార్తను ప్రకటించుటకు మంచి అవకాశముగా ఎంచుకొనెడి వాడను. "ఎందుకనగా విందు సంతోషములతో ఉన్న గృహములకు వెళ్ళుట కంటే ఏడ్చువారి గృహములకు వెళ్ళుట యుక్తమని ఒక మనుష్యుని యొక్క జీవితాంతము మరణమే. ***గనుక జీవించువారు ఆ సందేశమును సరిగా స్వీకరింతురు***" (ప్రసంగి 7:2).

వ్యాధి, రోగముల చేత బాధపడువారు ఆర్థికపరులైన చిక్కులలో ఉన్నవారు సంసార బంధములలో సంబంధములు విచ్ఛిన్నమైన వారు ప్రకృతి దుర్ఘటనలలో సర్వము కోల్పోయిన వారు పాపముల యొక్క పర్యవసానములను అనుభవించువారును. వారి పాపములను బట్టి వారిపైకి దేవుని తీర్పు శిక్ష కుమ్మరించబడిన వారు మొ॥ పరిస్థితులన్నిటిని అనుభవించుచు శ్రమ పడువారు దేవుని తట్టు తిరుగుటకు ఆయన తమ్మును మేల్కొలుపుచు పిలుచుచున్నాడని గ్రహింపవలెను. ఈ లౌకిక సంబంధమైన శ్రమల ద్వారా నిత్య దండన నుండి పాపులైన వారిని

తప్పించుటకు దేవుడు తన వైపునకు మళ్ళుడని పిలుచుచున్నాడు.

## తుది సారాంశము

తన రాజ్యమును నిర్మాణము చేసుకొనుటలో దేవుడే అత్యంత ప్రాముఖ్యమైన పనిని తానే జరిగించుచున్నాడు. మనము దేవునితో కలసి ఆయన పనిలో సహకరించు వారముగా మన తెలివి తేటలు వివేకము ఉపయోగించుచు ఆయనతో కలసి మనము పనిచేయవలెను.

చీకటిలో నున్న వారికి వెలుగు జ్యోతుల వలె విశ్వాసులు తమ విశ్వాస విధేయతల వలనను పరిశుద్ధమైన ప్రవర్తన ద్వారాను మంచి మాదిరిని చూపించవలెను. వారియందున్న నిరీక్షణ ప్రజ్వలమానమయినట్లు ఒక మంచి తీర్మానముతో విశ్వాసులు పనిచేయవలెను.

తమ హృదయములను మెత్తన చేసుకొని పశ్చాత్తాప పడుటకు దేవుడు వారి హృదయములలో పనిచేయుచు ప్రేరేపించుచున్నాడు. సృష్టి ద్వారాను, మనస్సాక్షి ద్వారాను ఆయా విధములైన దుర్ఘటనల ద్వారాను దేవుడు ఎల్లప్పుడు వారి హృదయములలో మాట్లాడుచు తన సువార్త ద్వారా దేవుని వైపు ఆకర్షించుచు వారిని పిలుచుచున్నాడు.

తాము ఎన్నడును సువార్త ఒక్కసారి కూడా విననప్పటికిని పాపులు తాము దేవునికి అవిధేయులై యున్నారనియు మరియు దేవునికి తమ పాపుల విషయమై జవాబుదారీ తమను కలిగియున్నారని వారు తెలుసుకొందురు. వారి హృదయ కాఠిన్యమే వారి పాపమును బట్టబయలు చేయును. వారు తమ పాపముల వలన పాప దాస్యములో ఉన్నారని బహుహేయమైన అధోస్థితికి పతనమైపోయి దేవుని ఉగ్రత వారి మీద కలదనియు వారు తెలుసుకొందురు.

మతాచార సంబంధమైన ప్రజలు దేవుని సత్యమును ఏ మాత్రము వెతకుట లేదు. వారి మతాచారములు అబద్ధమైనవనియు వాటిని నమ్మి తాము చేయు పాపకార్యములకు వారు సమర్పించుకొనచూచెదరు.

ప్రతి మనుష్యని యొక్క హృదయ స్థితిని దేవుడు ఎరుగును. తమ హృదయమును కఠిన పరచుకొని సువార్తను అంగీకరించుటకు సిద్ధ మనస్సు లేని వారి యొద్దకు కూడా ఆయన వాక్యమును ప్రకటించుటకు మనలను పంపినను వారికంటే ఎక్కువగా సువార్తను అంగీకరించుటకు సిద్ధమనస్సు కలిగిన వారి యొద్దకే మనలను ఎక్కువగా నడిపించును.

శ్రమలు, బాధలు, కష్టముల ద్వారా దేవుడు జనుల మనస్సులను మెత్తన చేయుటకు పని చేయుచుండును. సువార్తను ప్రకటించుటకు అట్టి అవకాశములను మనము వినియోగించుకొనవలెను.

ప్రపంచమంతటికి సువార్తను మనము ప్రకటించువలెనని దేవుడు కోరుచున్నాడు. ఈ గొప్ప ఆజ్ఞలను నెరవేర్చుటకు మనము పరిశుద్ధాత్మ యొక్క నడిపింపులో ఉండవలసి యున్నాము. అపొ.కార్యముల గ్రంథములో ఈ విధమైన ఆత్మ నడిపింపు ద్వారా వారు సువార్తను ప్రకటించిరి.

దేవునిని ఎరుగవలెనని ఎవరు యదార్థమైన హృదయములతో ఆయనను వెంబడింతురో దేవుడు వారికి తన్ను తాను బయలు పరచుకొనెను.

దేవుని సందేశముతో మనము ప్రకటించు సందేశము సరిపోయినదిగా ఉండవలెను.

దేవుని సింహాసనము యెదుట ఒకానొక దినమున ఆయా భాషలు మాట్లాడువారు, ఆయా జనాంగములు ఆయా జాతులు, గుంపులు వారందరును ఆయన ఎదుట నిలువబడి యుందురు. దేవుని యొక్క ఉద్దేశ్యమును సంపూర్ణముగా నెరవేర్చుటకు మనమందరము ఆయనతో కలసి పని చేయవలసిని వారముగా యున్నాము. అలాగున దేవుని ప్రజలందరు, ప్రతి ఒక్కరికిని సకల జాతుల వారికిని క్రీస్తు ప్రేమను చూపింపవలసి ఉన్నాము. దేవుడు కొన్ని జాతుల ప్రజలను, కొన్ని గుంపుల వారిని గురిగా ఏర్పరచుకొని వారి వద్దకు ప్రత్యేకమైన సేవకులను వారి వారి భాషా సంస్కృతి జీవన విధానములను ఎరిగిన వారిని వారి మధ్య దేవుని సంఘమును స్థాపించుటకు నడిపించవచ్చును. ఆలాగు పంపబడిన వారు అనేకులను శిష్యులుగా సిద్ధపరచి అట్టివారి ద్వారా అనేకమందిని శిష్యత్వములోనికి నడిపించు సేవకులనుగా తయారు చేయవలసిన వారైయుందురు!

